సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 27 । మే । 2025



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నాతా సూర్యారావు, కల్పన దంపతులు (అడ్డు రోడ్డు) రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు.




అలజడి..

విపరీత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం రాత్రి రాజోలు దీవిలో సముద్ర అలలు ఉవ్వెత్తున లేచాయి.

8లో

10,821 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 10,821 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కూటమి నేతల ఇసుక దోపిడీ

- స్థానిక మంత్రి ప్రోద్బలంతో దందా!
- వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సూర్యప్రకాశ్, ఇతర నేతలు

రామచంద్రపురం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీ కాస్తా కూటమి నేతల దోపిడీ వ్యవస్థగా మారిందని, స్థానిక మంత్రి సుభాష్ ప్రోద్బలంతోనే కూటమి నేతలు అక్రమ దందాకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కో–ఆర్డినేటర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఆరోపించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై స్థానిక గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కె.గంగవరం మండలం కోట వద్ద గౌతమీ గోదావరిలో అక్రమంగా ర్యాంపులు వేసి, యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారన్నారు. ఇదంతా మంత్రి సుభాష్ కనుసన్నల్లో జరుగుతున్నాయని ఆరోపించారు. ఆయా ర్యాంపులు మూసివేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాలతో రైతులు కొట్టుమిట్టాడుతుంటే, ఇవేమీ పట్టనట్టు మంత్రి వ్యవహరించటం సిగ్గుచేటని విమర్శించారు. కళ్లాల్లోనే ధాన్యం రాశులు తడిచి, రైతులు పుట్టెడు కష్టాల్లో ఉన్నా ఒక్క రైతును కూడా మంత్రి పరామర్శించలేదని, తడిచిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరిక



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అర్జీల పరిష్కారంలో ప్రజా సంతృప్తి అనేది అత్యంత ప్రధానమని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తో పాటు, జేసీ టి.నిషాంతి, డీఆర్‌ఓ రాజకుమారి, సర్వశిక్షా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ జి.మమ్మీ, డ్వామా పీడీ మధుసూదన్, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి అర్జీదారుల నుంచి 211 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందనే భరోసా అధికారులు కల్పించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదన్నారు. అర్జీని గడువులోగా పరిష్కరించి, వివరణ నివేదిక ఇవ్వాలని అధికారులను నిర్దేశించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 27 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్జీదారులు తమ ఫిర్యాదులు అందజేశారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలో తమపై దాడి చేసి గాయపరిచిన హోంగార్డు సత్తిబాబు, అతని కుమారుడు చంద్రపాల్, మరో వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన బాధితుడు మట్ట సునీల్‌కుమార్‌తో పాటు, మిగిలిన బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల కిందట ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా, మరలా గ్రీవెన్స్‌లో ఎస్పీకి విన్నవించుకున్నారు. కాగా ప్రతి ఫిర్యాదుదారుడి అర్జీని ఎస్పీ స్వయంగా పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదుల్లో కొన్ని ఆస్తి, కుటుంబ తగాదాలు ఉండటంతో, బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, పరిష్కార మార్గాలు సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో ఎస్పీ మాట్లాడారు.



వద్ది మహేష్



వద్ది రాజేష్



తాతపూడి నితీష్



ఎలుమర్తి సాయి



సబ్బతి పాల్ ఇమ్మానుయేల్



సబ్బతి క్రాంతి ఇమ్మానుయేల్



కాలపాక రోహిత్



ఎలిపే మహేష్



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుండె బరువై.. కళ్లు చెరువై..



గల్లంతైన ప్రాంతానికి చేరుకున్న స్థానికులు



కె.గంగవరం మండలం శేరిలంక వద్ద యువకులు గల్లంతైన ప్రాంతంలో పడవలపై గాలింపు

- గల్లంతైన బిడ్డలు తిరిగి వస్తారని తల్లిదండ్రులు, బంధువుల ఎదురుచూపులు
- విషాదం మిగిల్చిన శుభకార్యం
- వీడని అన్నదమ్ముల బంధం
- ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద దుర్ఘటన

ముమ్మిడివరం/ఐ.పోలవరం/అమలాపురం టౌన్/కె.గంగవరం/ఉప్పలగుప్తం: గోదారమ్మ ఒడిలోకి వెళ్లిన బిడ్డలు తిరిగి రాకపోవడంతో ఆ తల్లిదండ్రులు ఎనలేని క్షోభను అనుభవిస్తున్నారు. గోదావరిలో అదృశ్యమైన తమ బిడ్డల కోసం తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పగోడికి కూడా ఇలాంటి కష్టం వద్దు భగవంతుడా అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. గల్లంతైన బిడ్డలు ఎక్కడో ఓ చోట ఒడ్డుకు చేరుతారనే ఆశతో ఆ తల్లిదండ్రులు కళ్లల్లో వత్తులు వేసుకుని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. స్నేహితుడి సోదరి హాఫ్‌శారీ ఫంక్షన్‌కని వెళ్లి.. ఎనిమిది మంది సోమవారం గోదావరిలో గల్లంతైన సంఘటన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. శుభకార్యానికి వెళ్లిన వారంతా కనుమరుగయ్యారంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలతో సంఘటన జరిగిన కమినిలంక గోదావరి తీరం తల్లడిల్లుతోంది. గల్లంతైన ఎనిమిది మంది 14 నుంచి 20 ఏళ్ల లోపు వారే. కాకినాడ, ఐ.పోలవరం, కె.గంగవరం తదితర ప్రాంతాలకు చెందిన వారు. గల్లంతైన వారిలో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.

వీడని అన్నదమ్ముల బంధం

ఆనందంగా శుభకార్యానికి వెళ్లిన ఆ అన్నదమ్ములు గోదావరిలో గల్లంతై తమ తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చారు. కె.గంగవరం మండలం శేరులంకలో ఓ శుభకార్యానికి వెళ్లి ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరిలో గల్లంతైన 8 మందిలో ఇద్దరు అన్నదమ్ములు ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామానికి చెందిన వారున్నారు. అన్నదమ్ములు గల్లంతు కావడంతో ఎర్రగరువు గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అంది వచ్చిన తమ కుమారులను గోదారమ్మ కలిపేసుకుందని తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ బోరున విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది. ఎర్రగరువుకు చెందిన వడ్డి రాజేష్(18), వడ్డి మహేష్(15) అన్నదమ్ములు. తండ్రి భైరవస్వామి స్థానికంగా టెంట్‌హౌస్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వీరి తల్లి భవాని గృహిణి. రాజేష్, మహేష్‌లు కాట్రేనికోన మండలం దొంతికుర్రు ప్రభుత్వ వసతిగృహంలో చదువుకుంటున్నారు. రాజేష్ తొమ్మిది, మహేష్ పదో తరగతికి వచ్చారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండటంతో శేరిల్లంకకు స్నేహితులతో కలిసి శుభకార్యానికి వెళ్లారు. భోజనాల అనంతరం స్నేహితులంతా కలిసి గోదావరిలో స్నానానికి బయలుదేరారు. అక్కడి గోదావరి లోతు తెలియకపోవడమే వారి ప్రాణాల మీదకు తెచ్చిందని స్థానికులు అంటున్నారు. గల్లంతైన తమ కుమారులు ఎలాగోలా ఒడ్డుకు చేరుతారనే గంపెడాశతో ఆ తల్లిదండ్రులు గోదావరి ఒడ్డునే రోదిస్తుండటం చూపరులను కన్నీటిపర్యంతమయ్యేలా చేసింది.

చెల్లికి అన్నీ తానై.. రోహిత్ విషాద గాథ

చిన్నతనంలోనే తల్లిదండ్రులు శాశ్వతంగా దూరమయ్యారు. చెల్లెలి కోసం తన చదువునూ త్యాగం చేసి, చిన్నపాటి ఉద్యోగంలో చేరాడు. చెల్లెలిని పెద్ద చదువు చదివించి.. ఉన్నత స్థానంలో చూడాలనుకున్న అన్నయ్య.. గోదావరిలో గల్లంతైన హృదయ విదారక సంఘటన అందరినీ కలచివేస్తోంది. ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరిలో గల్లంతైన కలపాక రోహిత్(18) చిన్న వయస్సులోనే అమ్మానాన్నలను కోల్పోయాడు. కాకినాడకు చెందిన రోహిత్, బిందుమాధవి అన్నాచెల్లెలు. వీరి అమ్మానాన్నలు వేర్వేరు సంఘటనల్లో మృతి చెందారు. ఓ మిషనరీ సంస్థ ఆర్థిక సాయంతో పదో తరగతి పాస్ అయ్యాక పాలిటెక్నిక్ సీటు సంపాదించాడు. తల్లిదండ్రుల మరణంతో తనకు, చెల్లెలి చదువులకు ఆర్థిక భారం ఎదురైంది. మూడేళ్ల క్రితం మండపేటలోని వారి పెద్దమ్మ చేరదీసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి, రోహిత్ తన చెల్లెలిని చదివించసాగాడు. మండపేటలోనే ఓ రైస్ మిల్లులో గుమస్తాగా చేరాడు. కాకినాడ మిషనరీ స్కూలులో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో బిందుమాధవి ఉత్తీర్ణురాలైంది. ఆమెను రోహిత్ మండపేటలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిస్తున్నాడు. ఇంటర్ ఫస్టియర్‌లోనూ ఆమె ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. గుమస్తాగా పనిచేస్తూనే చెల్లెలిని ఉన్నత చదువు చదివించి, ఉన్నతోద్యోగంలో చూడాలని రోహిత్ ఆశపడ్డాడు. ఇంతలో గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. తన అన్నయ్య గోదావరిలో గల్లంతయ్యాడన్న వార్త తెలిసి బిందుమాధవి, ఆమె పెద్దమ్మ గుండెలవిసేలా రోదించారు. తనకు దిక్కెవరంటూ చెల్లెలు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

శేరిలంకలో విషాదఛాయలు

గోదావరిలో శేరిలంక గ్రామానికి చెందిన ఏలిపే మహేష్(14) గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహేష్ తల్లి వెంకటలక్ష్మి ఉపాధి కోసం విదేశాల్లో ఉంటుంది. వెంకటలక్ష్మి ఒక్కగానొక్క కొడుకు మహేష్‌ను అమ్మమ్మ సావిత్రి వద్ద ఉంచింది. అమ్మమ్మ పెంపకంలో ఉన్న మహేష్ గోదావరి అవతల ఉన్న ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదవిస్తోంది. ఈ ఏడాది మహేష్ ఎనిమిది నుంచి తొమ్మిదో తరగతికి వెళ్తున్నాడు. బంధువుల ఇంటి వద్ద శుభకార్యానికి వెళ్లి భోజనం చేసి, బంధువులతో కలసి ముమ్మిడివరం మండలంలోని కమినిలంక వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. శేరిలంక గ్రామంలో అప్పటి వరకు అందరితో కలసి సరదాగా ఆటపాటలతో అలరించిన మహేష్ గోదావరిలో గల్లంతయ్యాడనే విషయం తెలియడంతో గ్రామంలో విషాదం అలముకుంది. ఒక్కగానొక్క కొడుకు గోదావరిలో గల్లంతైన సమాచారాన్ని కుటుంబ సభ్యులు ఫోన్‌లో విదేశాల్లో ఉన్న తల్లి వెంకటలక్ష్మికి అందించారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి గ్రామస్తులకు ఫోన్ చేసి, తన బిడ్డ ఎక్కడైనా గోదావరి లంకల్లో ఉండి ఉంటాడేమో చూసి పుణ్యం కట్టుకోండంటూ తల్లి వెంకటలక్ష్మి తల్లడిల్లిపోయింది. ఫోన్‌లో ఆమె వేడుకుంటున్న తీరు చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

పాస్టర్ కుమారులు ఇద్దరు గల్లంతు

కాకినాడ క్రైం/కాకినాడ రూరల్: గోదావరిలో యువకుల గల్లంతు ఘటనతో కాకినాడలో విషాద ఛాయలు అలముకున్నాయి. గల్లంతైన ఎనిమిది మందిలో నలుగురు కాకినాడ వారే కావడం నగర వాసులను తీవ్ర వేదనకు గురి చేసింది. యువకుల గల్లంతుతో తూరంగిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండ అనే పల్లెటూరు నుంచి కాకినాడ వచ్చిన ఎలుమర్తి ప్రసాద్ కుటుంబానికి క్షోభను మిగిల్చింది. పొట్టకూటి కోసం ఎన్నో ఏళ్ల క్రితం కాకినాడ వచ్చి ఇక్కడ ఆయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ప్రసాద్ రెక్కల కష్టంతో పెద్ద కుమారుడు జగదీష్‌ను ఇంజినీరింగ్ చదివించారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన రెండో కుమారుడు సాయి మహేష్(19)ను ఫిజియోథెరపీ చేయించాలనే ఆశయంతో ఒంగోలులో చదివిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో కాకినాడ వచ్చిన మహేష్ స్నేహితుడి సోదరి ఫంక్షన్‌కు శేరిల్లంక వెళ్లి కనుమరుగయ్యాడంటూ తల్లిదండ్రులు ప్రసాద్, తల్లి సీతామహాలక్ష్మి భోరున విలపిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మహేష్ తండ్రి ప్రసాద్, సోదరుడు జగదీష్ గంపెడాశతో కమిని గ్రామానికి తరలివెళ్లారు. తన కుమారుడు గల్లంతయ్యాడని తెలిసి బావురుమన్నారు. నా బిడ్డ తిరిగొస్తాడంటారా అంటూ ప్రతి ఒక్కరినీ ఆ తల్లి అడుగుతుంటే అక్కడున్న వారి కళ్లుచెమర్చాయి.

ఇసుక తిన్నెల మాటున అగాధం

శేరిలంకను ఆనుకుని ఉన్న గోదావరి తీరం ఇసుక తిన్నెలతో కూడి ఉంటోంది. సముద్ర పోటు.. పాటుల వల్ల ఇక్కడ నీరు తక్కువగా ఉండడం, ఎక్కువగా ఉండడం జరుగుతుంది. మధ్యాహ్న సమయంలో నీరు తక్కువగా ఉండి గ్రామాన్ని ఆనుకుని ఇసుక తిన్నెలు పైకి తేలినట్టయింది. దీనితో యువకులు స్నానానికి నదిలో కొంత దూరం వెళ్లారని తెలిసింది. సుక తిన్నెలను ఆనుకుని ఉన్న లోతును అంచనా వేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ కారణంగానే ముందుగా వెళ్లిన మహేష్ మునిగిపోయాడని స్థానికులు చెబుతున్నారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, కె.గంగవరం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం దక్కలేదు.

ప్రభువా రక్షించు..

ఒకే కుటుంబంలో ఇద్దరు చేతికందొచ్చిన కుమారులు గల్లంతు కావడంతో ఆ కుటుంబంలో ఎనలేని విషాదం నెలకొంది. గల్లంతైన వారిలో ఇద్దరు అన్నదమ్ములది కాకినాడ జగన్నాథపురం. స్థానికంగా తండ్రి రమేష్‌బాబు చర్చ్ పాస్టర్‌గా సుపరిచితులు. పాస్టర్ ఇద్దరు కుమారులు సబ్బతి క్రాంతి ఇమ్మానుయేల్(19), పాల్ ఇమ్మానుయేల్(18) గల్లంతు కావడంతో ఆ కుటుంబానికి తీవ్ర వేదనను ఎదుర్కొంటోంది. వీరిలో పెద్దవాడు క్రాంతి ఇమ్మానుయేల్ చర్చి కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటాడు. తమ్ముడు స్థానిక కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. గల్లంతైన బిడ్డలు తిరిగి రావాలంటూ జగన్నాథపురం, పరిసర ప్రాంతాల చర్చిల్లో పాస్టర్లు ప్రార్థనలు చేశారు.

గుండెలు బాదుకుంటూ..

కాకినాడ అన్నమ్మఘాటికి చెందిన తాతపూడి నితీష్(18) ఇంటి వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే నితీష్ తండ్రి రాజు సహా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శేరుల్లంక గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లిన తనయుడు తిరిగొస్తారని ఎదురుచూస్తుంటే ఇటువంటి కబురు వినాల్సి వస్తుందని ఊహించలేదని తండ్రి కుప్పకూలిపోయారు.ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి వల్ల కావడంలేదు.

కదం తొక్కిన ఎండీయూ ఆపరేటర్లు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఎండీయూ ఆపరేటర్లతో ర్యాలీలో పాల్గొన్న జగ్గిరెడ్డి, జక్కంపూడి, వేణుగోపాలరావు, ఇజ్రాయిల్, సతీష్ కుమార్, రాజేశ్వరీదేవి తదితరులు

- కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ
- ఆందోళనకు వైఎస్సార్ సీపీ నేతల మద్దతు
- చంద్రబాబు తీరుపై చిర్ల జగ్గిరెడ్డి మండిపాటు

అమలాపురం రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను కొనసాగించాలని కోరుతూ జిల్లా ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం వాహనాలతో కదం తొక్కారు. 2027 వరకు తమ వాహనాలకు కాంట్రాక్ట్ ఉన్నా, ఆకస్మికంగా వాహనాలను రద్దు చేయడం వల్ల తాము ఉపాధి కోల్పోయి, అప్పుల పాలవుతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నల్లవంతెన వద్ద నుంచి రేషన్ పంపిణీ వాహనాలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పలు డిమాండ్లపై నినాదాలు చేస్తూ, అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. వాహనాల తొలగింపు విరమించుకోవాలని, అగ్రిమెంట్లు కొనసాగించాలని సంఘ అధ్యక్షుడు బొంతు రామదాసు, కార్యదర్శి గెద్దడ లోవరాజు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ మద్దతు

ఎండీయూ వాహనాలను ఎప్పటిలాగే కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా నేతలు మద్దతు తెలిపారు. ఎండీయూ వాహనంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోపై ఉన్న స్టిక్కర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పథకాన్ని ప్రవేశపెడితే.. కూటమి ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. దీనివల్ల రాష్ట్రంలో సుమారు 9,600 మంది, కోనసీమ జిల్లాలో 360 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్లను తొలగించి సీఎం చంద్రబాబు వారి కొంపలను కూల్చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అక్కసుతోనే చంద్రబాబు ఆయా వాహనాలను తొలగించి, ప్రజలపై కక్ష సాధిస్తున్నారన్నారు. ఐవీఆర్ సర్వేలో 78 శాతం ప్రజలు పంపిణీ బాగుందంటూ ఎండీయూ ఆపరేటర్ల వద్ద గొప్పలు చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు వాహనాలను తొలగించి వారికి అన్యాయం చేశారన్నారు. పార్టీ పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పాముల రాజేశ్వరీదేవి, పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, మార్గాన గంగాధర్‌రావు, మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు ఎండీయూ ఆపరేటర్లతో కలిసి కలెక్టర్ మహేష్‌కుమార్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. కాగా ఎండీయూ ఆపరేటర్ల ఆందోళనకు పలువురు బీఎస్పీ, వామపక్షాల నాయకులు సంఘీభావం తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల నిరసన

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరి ఆందోళనకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పాముల రాజేశ్వరీదేవి, ఇతర నాయకులు మద్దతు తెలిపారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించడానికి డబ్బుల్లేవా అని జగ్గిరెడ్డి ప్రశ్నించారు. నాలుగు ఇళ్లు కట్టుకోవడానికి చంద్రబాబుకు, మూడు హెలికాప్టర్లు కొనుక్కోవడానికి డబ్బులున్నాయా అని ఎద్దేవా చేశా రు. డిప్యూటీ సీఎం పవన్‌కు చెందిన శాఖలోనే ఇలా జరుగుతుంటే ఎవరూ కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు రూ.70 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, సత్వరం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా గ్రీవెన్స్‌లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు వినతిపత్రం అందించారు.

లక్షణంగా బదిలీలు

- చేయి తడపందే పోస్టింగ్‌లు లేవు
- సిఫారసు లేఖల్లో సిత్రాలెన్నో..
- సెమీ అర్బన్‌కు డిమాండ్
- చక్రం తిప్పుతోన్న షాడోలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: నేతల సిఫారసు లేఖలు (ఉత్తరం), సొమ్ము ముట్టజెప్పడం (దక్షిణం) లేకుండా బదిలీల ఫైళ్లు ముందుకు కదలడం లేదు. కూటమి ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దగ్గర నుంచి కోరుకున్న చోటు కోసం ఉద్యోగులు నేతలను ప్రసన్నం చేసుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారు. నేతల సిఫారసు లేఖల కోసం క్యాంపు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బదిలీల వ్యవహారాల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధుల అనుచరులు చక్రం తిప్పుతున్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, భార్యాభర్తలకు బదిలీల్లో వెసులుబాటు కల్పించారు. ఈ నేపథ్యంలో బదిలీలు అనివార్యం అనుకున్న వివిధ శాఖల ఉద్యోగులు జిల్లా కేంద్రానికి అందుబాటులో ఉన్న కేంద్రాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రం కాకినాడలో పనిచేస్తున్న ఉద్యోగులు సమీప మండలాలైన కరప, కాకినాడ, పెదపూడి, సామర్లకోట వంటి ప్రాంతాల్లో బదిలీలు ఆశిస్తున్నారు. ఇందుకు ఆయా మండలాల్లో అధికార కూటమి నేతలు, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడంలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. చేయి తడపందే నేతల సిఫారసు లేఖలు చేతిలో పెట్టడం లేదంటున్నారు.

2వ తేదీ వరకూ అవకాశం

రెండేళ్లు నిండిన వారు బదిలీలకు అర్హులు కాగా, ఐదేళ్లు నిండినవారు తప్పనిసరిగా బదిలీ కావాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. అన్ని శాఖల్లో బదిలీలకు వచ్చే నెల 2వ తేదీ వరకూ అవకాశం ఇస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ఉద్యోగులు తమకు అనువైన ప్రాంతాల్లో పోస్టు దక్కించుకోవటం కోసం నానా పాట్లు పడుతున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు, కూటమి నేతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా అనుకున్న ప్రాంతాల్లో పోస్టింగులను ఖాయం చేసుకుంటున్నారు. పలు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు తమకు ఎటువంటి ప్రమేయం లేదన్నట్టు బిల్డప్ ఇస్తూ అనుచరుల ద్వారా సిఫారసు లేఖలు చేతిలో పెడుతున్నారు. ఈ వ్యవహారంలో అందినంతా జేబులో వేసుకుంటున్నారంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని విభాగాలు కలిపి సుమారు 54 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 10 నుంచి 15 శాతం అంటే ఏడెనిమిది వేల మందికి బదిలీలు జరుగుతున్నాయని అంచనా. మొత్తం బదిలీల్లో సింహభాగం వైద్య, ఆరోగ్య శాఖలోనే జరుగుతున్నాయి. తరువాతి స్థానంలో ఉపాధ్యాయులున్నారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నేటితో ముగియనున్న గడువు

ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఇన్ని చిత్రాలు జరుగుతుంటే ఉపాధ్యాయుల బదిలీలు కూడా ఊపందుకున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 15,400 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 2023 తరువాత బదిలీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్, ప్రధానోపాధ్యాయులకు బదిలీలు జరుగుతున్నాయి. ఇందులో ఒకేచోట ఐదేళ్లు దాటి పనిచేస్తున్న వారికి బదిలీలు చేస్తున్నారు. మొత్తం అన్ని విభాగాలకు సంబంధించి సుమారు 3,696 మంది బదిలీలకు అర్హులుగా విద్యాశాఖ తేల్చింది. ఉపాధ్యాయులు, గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల బదిలీల దరఖాస్తుల గడువు ఈ నెల 22తో ముగిసింది. ప్రస్తుతం జరుగుతున్న స్కూల్ అసిస్టెంట్‌లు బదిలీ దరఖాస్తుల ప్రక్రియ కూడా వాస్తవంగా శనివారంతో ముగియాలి. ఒక్క రోజు గడువు ఇవ్వడంతో ఆదివారం రాత్రితో ముగిసింది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు గడువు ఈ నెల 27 తేదీ ముగియనుంది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకున్నారు. కౌన్సెలింగ్ మాత్రం మాన్యువల్‌గానే నిర్వహించనున్నారు. ఈ నెల 27 తేదీ అర్ధరాత్రికి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్న కాకినాడ జిల్లా విద్యాశాఖ వద్ద నిర్ధారణ కానుంది. అనంతరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారిని కాకినాడ డీఈఓ కార్యాలయానికి పిలుస్తారు. మొదట మండలం, తరువాత స్కూల్‌ను స్క్రీన్‌పై ప్రదర్శిస్తే ఉపాధ్యాయులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు మరో రెండు రోజులు మిగిలి ఉంది.

కార్యదర్శి స్థానానికి రూ.లక్ష

కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు ఆనుకుని ఉన్న సెమీ అర్బన్ ప్రాంతాల్లో పోస్టుల కోసం ఉద్యోగులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల కోసం వారి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు తమ చేతికి మట్టి అంటకుండా షాడోలను రంగంలోకి దింపి పని చక్కబెడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో ముఖ్య నేతల క్యాంపు కార్యాలయాల వద్ద సచివాలయ ఉద్యోగుల నుంచి వివిధ శాఖల ఉద్యోగుల వరకూ సిఫారసు లేఖల కోసం పడిగాపులు పడుతున్నారు. ఆ ప్రజాప్రతినిధులు కూడా అనుకూలమైన అధికారులను, సిబ్బంది తమ తమ నియోజకవర్గాల్లో కొలువుదీరేలా కుస్తీ పడుతున్నారు. చోటామోటా నేతలు కూడా సిఫారసు లేఖలు ఇప్పిస్తామంటూ ఉద్యోగుల నుంచి సొమ్ము గుంజుతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కార్యదర్శి సీటు కోసమే కూటమి నేతలు రూ.లక్ష వరకు రేటు ఫిక్స్ చేసి లాగేస్తున్నారు.

సామాజికవర్గాల వారీగా యత్నాలు

ప్రధానంగా కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీల్లో పోస్టింగ్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో సామాజికంగా తమ వర్గం వారిని నియమించుకునేందుకు నియోజకవర్గ నేతలు పట్టుబడుతున్నారు. కాకినాడ రూరల్, కాకినాడ సిటీ, పెద్దాపురం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌తో పాటు అమలాపురం, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం, సామర్లకోట తదితర మున్సిపాలిటీల్లో పోస్టింగ్‌లకు డిమాండ్ ఎక్కువగా కనిపిస్తోంది. రెండు బలమైన సామాజికవర్గాల నేతలు తమ వారి కోసం ఎమ్మెల్యేల వద్దకు సిఫారసు లేఖల కోసం క్యూ కడుతున్నారు. అర్హతలతో పాటుగా పని విధానం, సీనియార్టీ చూడకుండా కేవలం సామాజిక అంశాన్ని ప్రామాణికంగా సిఫారసు రావడంతో అధికారులు విస్తుపోతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

సహజ వనరుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు



సమావేశంలో చర్చిస్తున్న కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: సహజ వనరులు, ప్రకృతి సహజ సంపద పరిరక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైంది. గ్యాస్, చమురు, ఖనిజ, ప్రకృతి వనరుల పరిరక్షణ సమితి ఈ జిల్లా కమిటీని నియమించింది. జిల్లా నూతన కమిటీని సమితి కన్వీనర్, ఏపీ రైతు సంఘం జిల్లా కో–ఆర్డినేటర్ కె.సత్తిబాబుతో పాటు, ప్రతినిధులు స్థానిక ప్రెస్ క్లబ్‌లో భవనంలో సోమవారం సాయంత్రం ప్రకటించారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఉండవిల్లి గోపాలరావు, కో–కన్వీనర్లుగా గండి ఏసుదాసు, జాలెం సుబ్బారావు, సభ్యులుగా రాపాక రత్నరాజు, ఒంటిద్దు వెంకన్నాయుడు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, బందారు రామమోహనరావు, దేవ రాజేంద్రప్రసాద్, పులపర్తి సురేష్ నియమితులయ్యారు. జిల్లాలోని సహజ వనరులు ప్రజల ఆస్తి యాజమాన్య హక్కుగా ఉండాలని నూతన కమిటీ సమవేశం తీర్మానించింది. పలు అంశాలపై చర్చించి, వాటి కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించింది.

బలసిరి.. కొత్త వరి

- పెరిగిన కొత్త విత్తనాభివృద్ధి
- అందుబాటులోకి ఆధునిక వరి వంగడాలు
- విత్తనాభివృద్ధికి ప్రా'ధాన్యం'
- ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు
- ఆరోగ్యదాయక సాగుపై ప్రకృతి రైతుల ఆసక్తి

పిఠాపురం: రంగు.. రుచి.. వాసన.. ఇదేదో వాణిజ్య ప్రకటన అనుకుంటే పొరపాటే. వరిలోనూ ఇటువంటి లక్షణాలున్న బియ్యం అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఇటువంటి బియ్యం ఉన్నాయని చెబితే.. ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. ఇటువంటి అనేక రకాల కొత్త వంగడాలను ఇక్కడి రైతులు పండిస్తూ అందుబాటులోకి తెస్తున్నారు. అత్యధిక పోషక విలువలున్న వరి వంగడాలను ఉత్పత్తి చేయడానికి ప్రకృతి వ్యవసాయ రైతులు నడుం బిగించారు. అరుదైన వరి రకాలు గతంలో రాష్ట్రేతర ప్రాంతాల నుంచి తెచ్చే స్థానిక రైతులు.. ఇప్పుడు కాకినాడ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు పలు రకాల వరి వంగడాలను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇక్కడ పండించిన అరుదైన వరి రకాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామివారి నైవేద్యానికి సైతం ఉపయోగిస్తుండడం విశేషం. ఈ అరుదైన రకాల్లో నవారా, ఇంద్రాణి, కాలపట్టి, డెహ్రాడూన్ రెడ్ రైస్, పరిమళ సన్న, బర్మా బ్లాక్, రత్నచొడి, రక్తసాలి, చింతలూరు సన్నాలు, కూజి, పాటలియా, బాస్‌బోగ్, కామిని బోగ్, మైసూర్ మల్లిగ, సిద్ధ సన్నాలు, కోమల్ సాల్ వంటి రకాలున్నాయి. జిల్లాలో సుమారు 25 హెక్టార్లలో 30 మంది రైతులు సేంద్రియ పద్ధతిలో అరుదైన వరి రకాలను పండిస్తున్నారు.

జిల్లాలో అరుదైన రకాలివే..

- రక్తసాలి రక్త హీనతతో బాధపడుతున్న వారికి మంచి ఆహారం. ఈ బియ్యం తినడం వల్ల హిమోగ్లోబిన్ పర్సంటేజ్ పెరుగుతుంది. మూడు వేల ఏళ్ల నుంచి ఇది వాడుకలో ఉంది.
- కూచి పట్టాలియా బాగా సన్నగా ఉంటుంది. తినడానికి బాగుంటుంది. పోషకాలు ఎక్కువ.



అరుదైన రకాల ధాన్యం

- నవరను కింగ్ ఆఫ్ రైస్ అంటారు. ప్రస్తుతం దేశంలో లభించే బియ్యంలో అత్యంత పోషక విలువలున్న ఆహారం. సుగర్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచి ఆహారం. దీనిని రోజూ తింటే సుగర్ నార్మల్‌కు వస్తుంది. మోకాళ్ల నొప్పులూ తగ్గిస్తుంది.
- ధూదేశ్వర్ అనే దేశీయ వరి విత్తనం. గాలులకు పడిపోని సన్న రకం. పంటకాలం సుమారు 120 రోజులు. ఇది తెలుపు రంగులో ఉంటుంది, బాలింతలకు శక్తినిచ్చి, తల్లులకు, పిల్లలకు అధిక పోషకాలు అందిస్తుంది. పాల వృద్ధి, పిల్లల రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- ఇంద్రాణి అనేది దేశీయ వరిరకం. సువాసన ఉండే ఈ రకం పంట కాలం సుమారు 130 రోజులు. పాయసం, పులిహోర, పలావు, దద్ధోజనానికి అనుకూలమైంది.
- రత్నచొడి అనే దేశీయ వరి విత్తనం. తెలుపు రంగులో ఉండే సన్న రకం. పంట కాలం సుమారు 135 రోజులు. అధిక పోషక విలువలు కలిగి, కండపుష్టి, శరీర ధారుడ్యం పెంచి, మంచి పోషకాలు కలిగి ఉంటుంది. రోగ నిరోధక శక్తి కలిగిస్తుంది. పూర్వకాలంలో సైనికులకు ఆహారంగా ఇచ్చేవారు.
- కుజిపటాలియా అనేది దేశీయ విత్తనం. సన్న రకం. పంటకాలం సుమారు 120 రోజులు. గాలులకు పడిపోదు. కొవ్వు రహిత, సోడియం లేనివి. తక్కువ కేలరీలు, గ్లూకోజ్ తక్కువగా ఉండి, రోగ నిరోధక శక్తి పెంచుతుంది.



కొత్తపల్లిలో అరుదైన రకాల వరి సాగు చేస్తున్న పొలం

- కేత్రీ మహరాజ్ సెంటెడ్ వెరైటీ. గింజ పొడవుగా ఉంటుంది. పంటకాలం సుమారు 130 రోజులు. పాయసం, దద్ధోజనం, పులిహోర పలావులకు బాగుంటుంది.
- మైసూరు మల్లిగ దేశీయ విత్తనం. తెల్లని రంగు, గాలులకు పడిపోని సన్నని గింజ. పంట కాలం సుమారు 120 రోజులు. ఎదిగే పిల్లలకు అధిక పోషకాలు, ప్రొటీన్లు అందిస్తుంది.



పాతకాలపు పద్ధతిలో చేతితోనే నూర్పిడి

- ఘని అనే దేశీయ వరి రకం. చిన్న గింజ. పంట కాలం సుమారు 130 రోజులు. అధిక ఫైబర్, కాల్షియం కలిగి ఉంటుంది. స్పాండిలైటిస్, మోకాళ్ల నొప్పులు తగ్గించే ఆహార ఔషధంగా గుర్తింపు పొందింది.
- కుంకుమసాలి.. కుంకుమ పువ్వు, రక్తసాలి మొదలైన విత్తనాలు ఒకే కోవకు చెందిన దివ్యమైన ఔషధాలు. ఇవి రక్తంలోని మలినాలను శుభ్రం చేసి, వాత, పిత్త, కఫాలను సమపాళ్లలో ఉంచే దివ్యమైన ఆహార ఔషధాలు.

చాలా డిమాండ్ ఉంది



పన్నెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రాణప్రదంగా చేస్తున్నాను. ప్రకృతి వ్యవసాయంలో పండించిన అరుదైన రకాల ధాన్యం తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామివారికి నైవేద్యంగా ఉపయోగించడానికి ఇస్తున్నాను. సాధారణ రకాల కంటే.. మంచి డిమాండ్ ఉన్న అరుదైన రకాలను సాగు చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల విత్తనాలు తెచ్చి, విత్తనాభివృద్ధి చేస్తున్నాను. కేవలం విత్తనాలకు మాత్రమే వీటిని పండిస్తున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల రైతులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా పంపిస్తున్నాం. ఈ బియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో ఆదాయం బాగుంటుంది. నాతో పాటు జిల్లాలో చాలా మంది రైతులు వీటి సాగు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల రైతులూ నా వద్ద విత్తనాలు తీసుకుంటున్నారు.

– అడపా వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయ రైతు, భోగాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

విత్తనం కోసమే పండిస్తున్నా...



ప్రకృతి వ్యవసాయంలో పలు రకాల ధాన్యాన్ని పండిస్తున్నాను. కేవలం విత్తనాల కోసం కొన్ని అరుదైన రకాలు పండిస్తున్నాను. ఎవరైనా విత్తనాలకు అడిగితే ఉచితంగా ఇస్తున్నాను. అరుదైన రకాలు మంచి ఫలితాలు ఇస్తుండడంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. చాలా మంది రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరం పొలంలో పది రకాల అరుదైన రకాలను పండిస్తున్నాను. మన ప్రాంతంలో వీటిని పరిచయం చేయాలన్న ఆలోచనతో సాగు చేస్తున్నాను. ఈ సాగంతా పాతకాల పద్ధతిలోనే చేయాలి. యంత్రాలతో సాధ్యం కాదు. కేవలం చేతితో కొట్టి, నూర్చి, ఆరబెట్టడం ద్వారా మంచి విత్తనం తయారవుతుంది.

– ఉల్లి సురేష్, ప్రకృతి వ్యవసాయ యువ రైతు, కొత్తపల్లి, కాకినాడ జిల్లా

పెళ్లింట విషాదం

- విదేశంలో గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి
- స్వగ్రామానికి చేరిన మృతదేహం



తురాబ్ అలీ (ఫైల్)

మామిడికుదురు: మరో మూడు వారాల్లో ఆ ఇంట వివాహ వేడుకలు జరగాల్సి ఉంది. ఆనంద డోలికల్లో తేలియాడాల్సిన బంధుగణమంతా.. ఇప్పుడు శోకసంద్రంలో మునిగిపోయారు. కాబోయే పెళ్లి కొడుకుగా రావాల్సిన కుమారుడు.. నిర్జీవంగా ఇంటికి చేరడంతో ఆ తల్లిదండ్రుల విషాదానికి అంతులేకుండా పోయింది. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న మామిడికుదురు గ్రామానికి చెందిన ఎండీ తురాబ్ అలీ(28) ఈ నెల 17న గుండెపోటుతో మరణించారు. వచ్చే నెల 15న అతని వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఏర్పాట్లలో కుటుంబ సభ్యులుండగా, ఈ విషాద వార్త ఆ కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. వాస్తవానికి తురాబ్ అలీ సోమవారం ఇంటికి రావాల్సి ఉంది. యాదృచ్ఛికంగా అదే రోజు అతని మృతదేహం ఇంటికి చేరిన సంఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. అతని తండ్రి రిజ్వానుల్ హసన్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, తురాబ్ అలీ పెద్దవాడు. తురాబ్ అలీ తాతయ్య తురాబ్ హుస్సేన్ ఓ స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన పేరునే తురాబ్ అలీకి తల్లిదండ్రులు పెట్టారు.

పెళ్లి ఏర్పాట్లలో..

మరికొద్ది రోజుల్లో తురాబ్ అలీ వివాహం జరగాల్సి ఉండడంతో.. కుటుంబ సభ్యులంతా పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కల్యాణ మంటపం బుక్ చేసి, పెళ్లికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. బంధుమిత్రులకు శుభలేఖలు పంచడంలో బిజీగా ఉన్నారు. ఈలోగా తురాబ్ అలీ మరణవార్త చేరడంతో.. పెళ్లింట కాస్తా విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితుల కన్నీటి వీడ్కోలు నడుమ మామిడికుదురు ఖబర్‌స్థాన్‌లో తురాబ్ అలీ అంత్యక్రియలు జరిగాయి.

స్ట్రాంగ్‌మన్‌గా జగన్.. స్ట్రాంగ్ వుమన్‌గా వందన

ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



స్ట్రాంగ్‌మన్ విన్నర్ జగన్



స్ట్రాంగ్ వుమన్ విన్నర్ వందన

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో ఆదివారం జరిగిన మూడో యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. కేటగిరీల వారీగా విజేతలకు బహుమతీ ప్రదానం జరిగింది. తుది ఫలితాలను హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. స్ట్రాంగ్‌మన్ విన్నర్‌గా ఎం.జగన్ (కాకినాడ), స్ట్రాంగ్‌మన్ రన్నర్‌గా కె.శివకుమార్ (కాకినాడ), స్ట్రాంగ్ వుమన్ విన్నర్‌గా పి.వందన (అమలాపురం), స్ట్రాంగ్ వుమన్ రన్నర్‌గా బి.అఖిల (రామచంద్రపురం) నిలిచారు. అలాగే స్ట్రాంగ్ మాస్టర్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (రామచంద్రపురం), స్ట్రాంగ్ మాస్టర్ రన్నర్‌గా బి.అప్పన్న (అమలాపురం) సాధించారు. టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా కాకినాడ, టీమ్ చాంపియన్‌షిప్ రన్నర్‌గా అమలాపురం కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో విజేతలు 24 మంది వచ్చే నెల ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్టు కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ కాకినాడ, నాగమల్లితోట జంక్షన్ వద్ద పడమర ఫేసింగ్ 100 అడుగుల మెయిన్‌రోడ్‌ని ఆనుకుని 930 చ॥గ॥లు మరియు 846 చ॥గ॥లు కమర్షియల్ స్థలములు అమ్మకము నకు కలవు. ✆ : 92461 99099 [R-26]

■ కాకినాడ ఈస్ట్ పాయింట్ కాలనీ నందు (సురేష్ నగర్, శశికాంత్‌నగర్‌ల నుండి VS Lakshmi College కి గల 100 అడుగుల రోడ్డు) తూర్పు వైపు 33 అడుగుల సి.సి.రోడ్‌ని ఆనుకుని నూతనంగా నిర్మించిన పార్క్ ఎదురుగా, ఆదిత్య నర్సింగ్ కాలేజికి ముందు సౌత్ ఫేసింగ్ (40x60) కొలతలతో 266.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు, పార్క్‌కి దక్షిణ వైపు 40 అడుగుల రోడ్‌ను ఆనుకుని నార్త్ ఫేసింగ్ (40x78) కొలతలతో 346.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-25]

Services

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2628]

Wanted

■ An ISO Certified Company Requires ★ Chief Managers-5 Nos., Rtd. in any Department Govt/Pvt. Managers -10 Nos., 30+, Good Package. ✆ : 94907 45099 [R-7536]

కావలెను

బస్సు డ్రైవర్లు, క్లీనర్లు

ఆదిత్య విద్యా సంస్థలు

కాకినాడ, సూరంపాలెంలలో పనిచేయుటకు

హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటుగా 5 సం॥ల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండవలెను.

రాజమండ్రి, కాకినాడ, జగ్గంపేట, గోకవరం, రావులపాలెం, మండపేట, రామచంద్రపురం, నిడదవోలు, ఏలేశ్వరం, అనపర్తి, సీతానగరం తదితర ప్రాంతముల నుండి విద్యార్థులను తీసుకుని వచ్చుటకు.

99518 96665, 7997826664

■ వైజాగ్‌లో ప్రముఖ టైర్ కంపెనీలో డిగ్రీ చదివిన 18-24 సం॥లు ఉన్న అమ్మాయిలు (F) కి ట్రైనింగ్ & స్టైఫండ్ ఇచ్చి ఉపాధి కల్పించబడును. శిక్షణ కాలంలో ఉచిత వసతి+స్టైఫండ్ 7000/- PM ఇవ్వబడును. ఫోన్: 80192 55667. [V-7008]

■ Hyd చేవెళ్లలో కాలేజ్‌లో ఉంటూ పని చేయడానికి భార్యాభర్తలు కా॥. జీ: 20000 + వసతి. Ph: 8919737607/ 8328443702 [SCA25004025]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]

■ సాయిరామ్ హోమ్‌కేర్ Hydలో బేబీ& పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంట పనికి ఆడ /మగ కావలెను . జీ: 18 వేలు. 9949094607,9908454607 [SCA25003999]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏయూ డిగ్రీ ఫలితాల్లో 'ఆదిత్య' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో తమ విద్యార్థులు 1, 2, 3 ర్యాంకులతో పాటు, నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి సోమవారం తెలిపారు. బీసీఏ విభాగంలో దున్నా ధనలక్ష్మి మొదటి ర్యాంక్, ఎ.పావని ఏ.క్యాతిశ్రీ రెండో ర్యాంక్, బి.శిరీష మూడో ర్యాంక్, జి.రిపిక మూడో ర్యాంక్ సాధించారన్నారు. బీబీఏ నుంచి కె.మహిత రెండో ర్యాంక్, వి.మౌనిక మూడో ర్యాంక్, జి.వెంకటసాయికీర్తి మూడో ర్యాంక్, బీఎస్సీలో ఎం.యమున ఫస్ట్ ర్యాంక్, సత్తి మోనిక విషాల్ మూడో ర్యాంక్, బీకామ్ నుంచి పి.హరిప్రియ రెండో ర్యాంక్, పి.పల్లవి మూడో ర్యాంక్ సాధించారని చెప్పారు. యూనివర్సిటీ తరఫున ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అభినందనలు తెలిపారు. ఆదిత్య కళాశాల ఉన్నత విద్యా ప్రమాణాలు, అధ్యాపకుల కార్యదక్షతను కొనియాడారు. విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. 2024–25లో ఇప్పటి వరకూ జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15,120 మంది విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

నిడదవోలు: పట్టణంలోని శెట్టిపేటకు చెందిన అడపా కోటసత్యనారాయణపై హత్యాయత్నం నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ సోమవారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని శెట్టిపేటలో అడపా కోటసత్యనారాయణ తనకు దూరపు బంధువైన కానూరి కోటసత్యనారాయణ మధ్య పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో 2016లో అడపా కోటసత్యనారాయణపై కత్తితో దాడి చేసి హతమార్చడానికి కానూరి కోటసత్యనారాయణ యత్నించాడు. దీనిపై అప్పట్లో నిడదవోలు సీఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకులపాటి వెంకటరమణ వాదించగా, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్,, ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు ఈ కేసుకు సహకరించారు. కోర్టు హెచ్‌సీ సీహెచ్ కరుణాకరరావు సాక్షులను హాజరుపరిచారు.

స్టాఫ్ నర్సు ఆత్మహత్యాయత్నం

– హెడ్ నర్సు వేధిస్తోందంటూ ఆరోపణ

గోకవరం: హెడ్ నర్సు వేధిస్తుందని ఆరోపిస్తూ స్టాఫ్ నర్సు ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, కొవ్వూరుకు చెందిన నారికమల్లి డేజిరత్నదీపిక స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రెండేళ్లుగా వైద్యవిధాన పరిషత్‌తో కాంట్రాక్టు విధానంలో స్టాఫ్ నర్సుగా పని చేస్తుంది. మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉన్న ఆమె.. హెడ్ నర్సు వేధిస్తుందంటూ స్పిరిట్ తాగింది. ఆమెను గుర్తించిన స్థానిక సిబ్బంది వెంటనే చికిత్స అందించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ, గత జనవరి నుంచి హెడ్ నర్సు లీల తనను మానసికంగా వేధిస్తుందన్నారు. అకారణంగా దూషించడం, పేషెంట్ల ముందు చులకనగా మాట్లాడుతుందన్నారు. మధ్యాహ్నం జనరల్ వార్డులో విధులు నిర్వహిస్తున్న తనను మందుల విషయమై ఇష్టానుసారంగా మాట్లాడటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్టు తెలిపింది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజను సంప్రదించగా, స్టాఫ్ నర్సును హెడ్ నర్సు వేధింపులకు గురి చేస్తుందన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఓపీ పెరగడం, సిబ్బంది తక్కువగా ఉండటంతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిడి మేరకు, తాము సిబ్బందికి పనులు కేటాయిస్తున్నామని, వేధింపులు వంటి వాటికి తావులేదన్నారు. మందుల విషయంలో ఇద్దరి మధ్య వివాదం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై స్టాఫ్ నర్సు స్టేట్‌మెంట్‌ను హెచ్‌సీ వీర్రాజు రికార్డు చేశారు.

యువతి ఆత్మహత్య

ఉప్పలగుప్తం: పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తి మోసం చేయడంతో మనస్తాపానికి గురైన యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ రాజేష్ వివరాల మేరకు, ఎస్.యానం పెదపేటకు చెందిన మట్టా సునీత(24) ఆదివారం సాయంత్రం ఇంటి పక్కనున్న రేకుల షెడ్డులో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సూసైడ్ నోట్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఓ వివాహితుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేయడంతో మనస్తాపానికి గురై తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆమె తండ్రి నకులుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేష్ తెలిపారు.

యువకుడిని బలిగొన్న లారీ



సంఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహం

పెరవలి: లారీ రూపంలో రహదారిపై చీకట్లో పొంచి ఉన్న మృత్యువును ఆ యువకుడు గమనించలేకపోయాడు. ఫలితంగా రాంగ్ రూట్‌లో, హెడ్‌లైట్లు కూడా వేయకుండా దూసుకొచ్చిన లారీ అతడి ప్రాణాన్ని కబళించింది. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు, పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కుంపట్ల పెద వీరన్న(24) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ, కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఆదివారం కాకరపర్రులో పనికి వెళ్లి, రాత్రి 10.30 సమయంలో మోటార్ బైక్‌పై స్వగ్రామానికి తిరిగి పయనమయ్యాడు. మార్గం మధ్యలో రహదారిపై ఓ లారీ హెడ్ లైట్లు వేయకుండా రాంగ్ రూట్‌లో ఆగి ఉంది. లైట్లు వేయకుండానే ఆకస్మికంగా ఆ లారీని ముందుకు దూసుకురావడంతో.. అటుగా మోటార్ బైక్‌పై వచ్చిన పెద వీరన్న అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అతడి తండ్రి కుంపట్ల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబాన్ని మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు.

అలజడి..



శంకరగుప్తం వద్ద ఉధృతంగా సముద్ర అలలు

- ఉధృతంగా సముద్రం
- పొంగుతున్న డ్రెయిన్లు
- తీరంలో మునిగిన తోటలు, రోడ్లు

మలికిపురం: విపరీత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం రాత్రి రాజోలు దీవిలో సముద్ర అలలు ఉవ్వెత్తున లేచాయి. తీరంలో సాధారణం కంటే పది మీటర్లు ముందుకు సముద్రపు కెరటాలు వస్తున్నాయి. అంతర్వేది నుంచి కరవాక వరకూ పరిస్థితి ఇలాగే ఉంది. అలల తీవ్రతకు తీరం భారీ కోతకు గురవుతోంది. సమీపంలోని డ్రెయిన్లు పొంగాయి. ఫలితంగా జనావాసాలతో పాటు, కొబ్బరి తోటల్లోకి నీరు చేరింది. ఉప్పునీరు ప్రవేశిస్తుండడంతో కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయి. అలల ధాటికి ప్రధాన రహదారిని సైతం ఉప్పునీరు తాకింది. ప్రధానమైన శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లోకి సముద్రపు నీరు ఎగదన్ని పొంగుతోంది. ఫలితంగా డ్రెయిన్ పరివాహక ప్రాంతంలోని కొబ్బరి, సరుగుడు తోటలను సముద్రపు నీరు ముంచెత్తుతోంది. సుమారు పది వేల ఎకరాల్లో ప్రస్తుతం ఈ నీరు చేరింది. కరవాక, గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం, చింతలమోరి, కేశవదాసుపాలెం, అంతర్వేది తీర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. కేశనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డును సైతం సముద్రపు నీరు తాకింది. తీరం వెంబడి ప్రధాన రహదారి జలమయమైంది. ఓఎన్జీసీ వాహనాల రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి.



తూర్పుపాలెంలో పొంగిన శంకరగుప్తం మేజర్ డ్రెయిన్



కేశనపల్లి ఆర్అండ్బీ రోడ్డుకు చేరిన సముద్రపు నీరు



కేశనపల్లిలోని కొబ్బరి తోటల్లో ఉప్పు నీరు